# 11. నవాబుగారూ - నేతిడబ్బాలు!

నవాబ్ ఉస్మాన్ అలీగారి హైదరాబాద్ చార్మినార్ కూ, సిగరెట్లకూ, గోచీగుడ్డకూడా లేని దరిద్రులకూ ఎలా ప్రసిద్ధో అలాగే మధ్య భారతం లోని డాటియా సంస్థానం స్వచ్ఛమూ, సుగంధభరితమూనైన వెన్నకు ప్రసిద్ధి.

నైజాం నవాబుగారూ, డాటియా మహారాజావారూ ఆత్మీయ మిత్రులనే విషయం కూడా అలాగే సుప్రసిద్ధం.

ఈ డాటియా సంస్థానపు వెన్న గురించిన నోరూరించే వర్ణనలు విన్న నవాబ్ ఉస్మాన్ ఆలీగారు సరదాపడి కాస్త వెన్న పంపమని కబురంపగా డాటియా మహారాజా వారు మహదానందం పొంది మిత్రుని సంతోష పెట్టదలచిన వారై......

అక్షరాలా పన్నెండుడజన్ల పెద్ద అందమైన టిన్నులలో స్పెషల్ గా సేకరించిన స్వచ్ఛమైన వెన్నను నింపించి, నవాబుగారికి సర్వ లాంఛనాలతోనూ కానుకగా పంపించేరు.

అంత హంగుతో వచ్చిన అన్ని డబ్బాలనూ చూసి మహదానందం పొందిన నవాబుగారు వంటశాల తాలూకు గోడవున్లో వాటిని భద్రపరచమని ఆదేశించి రాచకార్యాలలో మునిగి తేలుతుండగా అలా రెండేండ్లు గడచి పోయేయి.

నవాబుగారు నేతిడబ్బాల్ని మరచిపోయేరు గానీ ఆ డబ్బాలు మాత్రం నవాబుగార్ని మరచిపోలేదు. అవలా నవాబుగారి మీది విరహంతో కుళ్లి క్రుశించి కాలం తీరిపోగా సువాసనల్లా దుర్వాసనగా మారి

ఆ గోడవున్లో ముక్కుగల వాడెవడూదాన్ని మూసుకునయినా సరే అడుగు పెట్ట వీలు లేనంతగా చెడిపోయాయి.

కాని...కాని సదా చైన్ స్మోకింగ్‌లో కాలక్షేపం చేసే నవాబు గారికి సువాసన లెలా అందుతాయి. వారి దృష్టిలో కి విషయాన్ని తీసుకు రాగల దమ్ములు కోఠీలోని సేవకులకుగానీ ఉద్యోగులకుగానీ ఏనాడూలేవు.

అందుకని వారంతా ప్రధాన మంత్రి నవాబ్ సాలార్‌జంగ్ సన్నిధికి పోయి చెప్పుకోగా, వారున్నూ ధైర్యంచేసి నవాబుగారికి విన్నవించుకోగా......

శ్రీవారు ఉలిక్కిపడి..."వెన్న చెడిపోవటమేమిటి? అందులోనూ డాటియా మహారాజావారు ప్రేమతో పంపిన వెన్న..." అని కసురుకుని......

అరగంట ఆలోచించి...

మరుక్షణం పోలీస్ ఆఫీసరుగా పనిజేస్తున్న రాజాబహదూర్ వెంకట రామారెడ్డి గారిని పిలిపించి ఏమని సెలవిచ్చారంటే...!

"నాయనా! ఈ హైద్రాబాద్లో ఇన్నిగుళ్లూ, ఇందరు దేవుళ్లూ ఉన్నారుగదా! గుడుల్లో దీపారాధనకూ, దేవుళ్ళ నైవేద్యానికి వెన్న సదా అత్యవసరం గదా!...

"కనుక...

"మనగోడాన్లో ఉన్న వెన్న డబ్బాల్ని ఏలాగోలా తక్షణం వాళ్ళకు అమ్మివేసి లెక్క సమర్పించుకో"...

అని ఆదేశించేరు.

ఈ ఫర్మానా వినగానే నవాబుగారి విషయ పరిజ్ఞానానికీ, తెలివితేటలకూ మూర్ఛవచ్చినంతపనై...ఏలాగో తమాయించుకుని, రెడ్డిగారంత కంటే తెలివైన ఘటం కనుకా- పొట్టివాళ్ళ కసలే బుద్ధులు తట్టలకొద్ది

ఉంటాయిగనుకా ఓ నిమిషం ఆలోచించి, మరి నవాబుగారితో చర్చించి గానీ, వాదించిగానీ లాభంలేదని తేల్చుకుని...

"జీ...హుజూర్..." అని సెలవు తీసుకుని రెడ్డిగారేం చేశారంటే......

ఆ నూటనలభై నాలుగు వెన్న డబ్బాలనూ ఓ లారీలో వేయించుకుని, ఊరిబయటకు తీసుకుపోయి...

అక్కడ ఓ నాలుగు నిలువుల లోతు గొయ్యి తీయించి, వాటిని అందులో శాస్త్రోక్తంగా పాతిపెట్టించి, కోఠీకి తిరిగివచ్చి, నవాబుగారి దర్శనం చేసుకుని...

జేబులోంచి అక్షరాలా రెండువందల ఒక్క హాలీ రూపాయలను తీసి, ముకుళిత హస్తులూ, అవనత శిరస్కులూనై నవాబుగారికి సమర్పించుకుని "వెన్న అమ్మగా వచ్చిన డబ్బిది మహాప్రభో!" అని విన్నవించుకోగా...

పరమానంద భరితులై ఆ డబ్బును జాగ్రత్తగా లెక్కపెట్టుకుని, అంగీలోపలి జేబులో భద్రంగా దాచుకుని......

మహా ఘనతవహించిన నిజాంనవాబు అసఫ్‌జా ముజఫర్ ఉల్ ముల్క్‌కి నిజాం ఉద్దౌలా, సర్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్, పతే జంగ్ వారు ఏం చేశారంటే...రెడ్డిగారి సేవలకూ, ప్రభుభక్తి పరాయణతకూ, కార్యదక్షతకూ సంతసించి తక్షణం ప్రమోషన్ జారీచేసి ఆయన హోదాను పెంచి పారేశారు.

అందుకే గాబోలు నారాయణగూడా చౌరస్తాలో కాంస్యవిగ్రహ రూపంలో వేంచేసిఉన్న రాజాబహద్దర్ వెంకటరామారెడ్డిగారు వీపు కోఠీవైపు పెట్టి మరీ ముసి ముసిగా లోలోపలే నవ్వుకుంటూ ఉంటారిప్పటికీ!

★